౩౨

# "మే - ఇరవై యేడు"

మే నెల 2 7 వ తారీకు?

ఆ రోజు ప్రొద్దున ఢిల్లీ నగరంలో.........సామాన్యులను......
"ఏమిటి ఇవాళ తారీకు కున్న ప్రాముఖ్యం...?" అని అడిగితే నూటికి ఎనభై మంది అయినా...ఆ అడిగిన వారి మొహంకేసి చూస్తూ ఉండేవారు. కొందరు తల గోక్కునేవారు, మిగిలినవారు ఆనాటి దినపత్రికనుచూచియో, లేక రేడియోను వినో...చెప్పేవారు." నేటికి జవహర్‌లాల్ నెహ్రూ మరణించి నాలుగు సంవత్సరాలయింది". అని.

నాలుగేళ్ళ క్రింద

ఆ తారీఖు పొద్దున దినపత్రికలో.

అంతకు ముందు రోజు డెహ్రాడూన్ నుంచి ఢిల్లీకి తిరిగి వచ్చి హెలికాప్టర్ నుంచి దిగుతున్న నెహ్రూ ఫొటో చూసారు జనం. "నెహ్రూ చాల ఉల్లాసంగా కన్పించారు" అంటూ ఆ ప్రక్కనే ఉన్నవార్తను చూసి ఉప్పొంగిపోయారు.

ఆ మధ్యాహ్నం రెండు గంటలప్పుడు అన్ని ఆఫీసులలోనూ ఒక పుకారులాటిది. పచ్చటి గడ్డి మధ్య పాములా ప్రవేశించింది. "ఇది నిజమా" అని ఒకరి నొకరు రహస్యంగా అడుగుతున్నారు. అవుననుకుంటే గుండె గతుక్కుమంటుంది. కాదు కాదు అన్నది మనసు. పార్లమెంటు భవనం మీది త్రివర్ణపతాకం ఆ మధ్యాహ్నపు వేళ క్రిందికి దిగింది.

అనుమానం నిజమయింది.

రాదనుకున్నది రానే వచ్చింది.

జనులొకిరి మొహాలొకరు చూసుకున్నారు.

ఎవరినోరూ పెగలలేదు.

రేడియో చెప్పింది...జవహర్లాల్ నెహ్రూ మరణించారు.

ఆ వార్త తర్వాత ప్రళయం తర్వాత వలె అనంతమైన నిశ్శబ్దం.

ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ, కీచుగా, రోదిస్తూ, గుండెలను చీలుస్తూ సారంగి వాద్యాలాపన.

అంతదాక జ్వాజ్వల్య మానంగా వెలిగిన సూర్యుడు కూడా ఎందుకో సిగ్గు పడుతున్నట్లనిపించింది.

ఆఫీసులను, ఇళ్ళను వదిలారు జనం.

ఆ వేసవినెలలో ఆమండుటెండవేళ వీధులమీద క్రిక్కిరిసిన జనం ఎవరూ ఎవరితోనూ మాట్లాడడం లేదు ఎవరికివారే హడావిడిగా, వడివడిగా అడుగులు వేసుకుంటూ వెళ్తున్నారు. అందరి గమ్యము ఒక్కటే.

ఆగమ్యం "తీన్‌మూర్తి భవన్''

ఆ భవనంలో ఆ మూర్తి మరిలేదు. ఆవెలుగు మరి లేదు. అంతదాక ఆ వెలుగునిచ్చి ఆరిపోయిన ఆ దీపాన్ని చూడాలని అందరి తహతహ. మరి కొన్నిగంటలయితే అదీవుండదు. మిగిలేవెల్లా ఫోటోలు స్మృతులు, జయంతులు, వర్ధంతులు... అందుకనే ఆ తొందర.

నాలు గయిదు దశాబ్దాలు దేశానికి దేవుళ్ళుగా నిలిచిన ఇద్దరిలో మిగిలిన ఒక్కరూ ఆనాడక్కడనుంచి ఎగిరిపోయారు. చిరునవ్వుతో, కోపంతో, దీక్షతో, త్యాగంతో, ప్రేమతో, విసుగుతో, అల్లరితో, ఆకర్షణతో, దేశాన్ని ప్రపంచాన్ని ప్రజలను నాయకులనూ ఏలిన మహామనిషి ఉత్తదేహంగా మిగిలాడు.

జనం చేరారు,

జనమంటే వందా వెయ్యీకాదు,

లక్షలమంది జనం

హనుమంతుడి తోకలా వరుసలు,

నెమ్మది నెమ్మదిగా నడిచి ... అడుగులమీద అడుగులువేసి. కొన్ని గంటలు వేచి ... ఆ వీధినంతాదాటి. ఆప్రాకారందాటి, ఆతోటను గడిచి. ఆవిశాలమైన భవనంలో ఆగదిలోకి అడుగుపెట్టారు.

జీవితమంతా పోరాడి పోరాడి, అలసిపోయి ప్రశాంతంగా విశ్రమిస్తున్న ఆమూర్తిని చూడగానే భోరుమని కన్నీరు,

ఆడ, మగ, పిన్న - పెద్ద. సివిల్ - మిలిటరీ - తేడాలులేని కన్నీరు ...

నెహ్రూ ... మా నెహ్రూ ... మన నెహ్రూ ఇకలేడా?

ఇదెలా సాధ్యం ?

ఈ అబద్ధాన్ని ఎవరు సృష్టించారు ?

ఈ క్రూర నాటకాన్ని - ఆడుతున్న దెవరు? ప్రశ్నలన్నిటికి జవాబుగా అదిగో అన్నిటికి అతీతంగా పడుకునివున్న మూర్తి ....

ఆసాయంకాలం సూర్యుడుముందుగానే అస్తమించాడు, గాలిదుమారం లేచింది. ఆకాశం అంతా దుమ్ముదుమ్ముగా, వింతగా అసహజంగా అటు వెలుతురో లేక ఇటు చీకటో కాక వుండింది.

గంట గంటకూ తీన్‌మూర్తి భవనంలోకి వెళ్లడానికి వెళ్తున్న ప్రజల సంఖ్య లక్షలు లక్షలుగా పెరుగుతూంది.

ఆసాయంకాలం వేళ —

సుమారు అయిదున్నర గంటలప్పుడు —

ఒక ముసలి పంజాబీ స్త్రీ .... కాయకష్టం చేసే మహిళ, నెమ్మదిగా నడచి నాదగ్గరకు వచ్చింది,

''ఏం బాబూజీ ... పండిట్‌జీ చనిపోయాడట .... నిజమేనా ?''

తల వూపాను.

"అయితే రేపటినుండి మా బీదసాదలకు రోటీ" ఎట్లా దొరుకుతుంది?" అని అడిగింది ఆ పంజాబీ ముసలిది.

జవాబు ఏమి చెప్పగలం ఆప్రశ్నకు?

అది రోటీ కోసం భయంకాదు

అది ఈదేశంలోని అట్టడుగు మనిషికూడా తనకే స్వంతంగా తనకే చెందిన మనిషిగా ప్రేమించి పూజించిన ఆ మహావ్యక్తికి కాక నీరాజనం.

సరిగా ఇరవై నాలుగు గంటల తర్వాత యమునా నదీతీరాన... గాంధీసమాధిక అవతలగా .... జవహర్‌లాల్ దేహాన్ని మాయం చేసిన అగ్ని జ్వాలలు ఆకాశం ఎత్తుకు లేచాయి.

అక్కడచేరిన దేశవిదేశా ప్రజల, నాయకుల గుండెలలో బరువు పాతాళంతో చేతులు కలిసింది ....

♦ ♦ ♦

మరురోజు దేశం తనయాత్ర మొదలెట్టింది, అట్లాంటి రోజులు నెలలు గడిచాయి.

నాలుగు సంవత్సరాలు నడిచాయి.

నేడు వర్థంతులు, జయంతులు స్మృతులూ విగ్రహాలూ మ్యూజియం రాలూ, మెమోరియల్ స్టాంపులూ మొదలయిన వాటి కింద ఎక్కడో నెహ్రూ అన్న మనిషి జీవితంలోని కొన్ని గొప్ప సూత్రాలు మూలనపడి నాప్పయి.

వాటిని వెతికి బయటకు తీసి వాటికి మన జీవితంలో ప్రాణం పోసే దెప్పుడు.–?

★

(21 జూన్, 68)